ప్రజాశక్తి

బుధవారం 25 జనవరి 2023

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి


ధాన్యం కొనుగోలు..

అంతంతమాత్రమే..!

లక్ష్యం : 87 వేల మెట్రిక్ టన్నులు

కొనుగోలు : 13 వేలు

ప్రభుత్వ నిబంధనలతో ఆసక్తిచూపని రైతులు



ధాన్యం కొలుస్తున్న హమాలీలు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ధాన్యం కొనుగోలు అంతంతమాత్రంగానే ఉంది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఇచ్చిన 21 రోజులకు బిల్లులు రైతుల ఖాతాలో జమచేస్తామని ప్రభుత్వం చెప్పినా, చెల్లింపులో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. దీనికితోడు ప్రభుత్వం పెట్టిన నిబంధనలు వారికి ప్రతిబంధకంగా ఉన్నాయి. అవి తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొనేలా లేకపోవడంతో ప్రయివేటు వ్యాపారులకు విక్రయించేందుకు మొగ్గుచూపుతున్నారు. దీంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో 87 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని పౌర సరఫరాల సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ మంగళవారం నాటికి 2,892 మంది రైతుల నుంచి 13,142 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయగలిగింది. డిసెంబరులో కొనుగోలు ప్రారంభించారు. జిల్లాలో 380 రైతు భరోసా కేంద్రాలను 78 క్లస్లర్లుగా ఏర్పాటుచేసి ధాన్యం కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేశారు. వీటి ద్వారా రూ.18.78 కోట్ల విలువైన 13,142 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయించిన 2,892 మంది రైతుల్లో 1807 మంది రైతులకు రూ.9.45 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. ఇంకా 1085 మంది రైతులకు రూ.9.33 కోట్లు రావాల్సివుంది.

ఈ ఖరీఫ్‌లో 1,36,232 ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖాధికారులు అంచనావేయగా, 1,39,242 (102 శాతం) ఎకరాల్లో రైతులు పండించారు. క్వింటా గ్రేడ్ - ఎ రకం ధాన్యానికి రూ.2060, సాధారణ రకానికి రూ.2040 చొప్పున ప్రభుత్వం ధర నిర్ణయించింది. ధాన్యం అమ్ముకొనేందుకు ముందుగా రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవడం, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతుల పంట ఈ - క్రాప్‌లో నమోదు మిగతా 2లో..



విశాఖ నగరంలో ఆందోళన చేపట్టిన అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల ఆందోళన

- ఫేస్ యాప్ రద్దు చేయాలని, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్
- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ధర్నాలు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

ఫేస్ యాప్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మంగళవారం ఎక్కడికక్కడ ఆందోళనలు జరిగాయి. విశాఖలో జరిగిన కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారు బృందావతి, గౌరవాధ్యక్షులు పి.మణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.తులసి, ఎల్.దేవి, కార్యనిర్వహణ అధ్యక్షులు ఆర్.శోభారాణి, కోశాధికారి పద్మావతి మాట్లాడారు.

వార్తలు 8వ పేజీలో..



కలెక్టర్ మల్లికార్జునకు బెస్ట్ ఎలెక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ఎన్నికల కమిషన్ స్పెషల్ సుమ్మరి రివిజన్ - 2023లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఉత్తమ విధానాలు అవలంబించిన అధికారులకు అవార్డులు ప్రకటించింది. దీనిలో విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు బెస్ట్ ఎలెక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు దక్కింది. యువ ఓటర్ల నమోదు, చనిపోయిన, వలసపోయిన ఓటర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదులో యువత భాగస్వామ్యం పెంచడంతో పాటు మహిళల్లో ఓటరు మిగతా 2లో..

ఉక్కు ప్రజా గర్జనకు మద్దతివ్వండి

మంత్రి అమర్‌నాథ్‌ను కలిసిన పోరాట కమిటీ నేతలు



అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, కార్మిక, ప్రజా సంఘాలు ఈ నెల 30న ఉక్కు నగరంలో చేపట్టే ఉక్కు ప్రజా గర్జనకు మద్దతివ్వాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు కోరారు. ఈ మేరకు మంత్రిని నాయకులు జె.అయోధ్యరామ్, డి.ఆది నారాయణ, రాజశేఖర్, తదితరులు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి నేతృత్వంలో మంగళవారం కలిశారు. స్టీల్‌ప్లాంట్ నేపథ్యాన్ని వివరించారు. 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నడుస్తూ లాభాలను ఆర్జిస్తున్న స్టీల్ ప్లాంటును విక్రయించాలన్న దుర్మార్గమైన ఆలోచన కేంద్రానికి తగదన్నారు. ప్లాంట్ పూర్తిస్థాయి ఉత్పత్తికి కావలసిన ఆర్థిక సాయం నిలిపివేసి, క్యాపిటల్ రీస్ట్రక్చరింగ్ చేయకుండా కుట్రలు పన్నుతున్నారన్నారు. ప్లాంట్ బ్యాంకు రుణాల నష్టాలు చూపి స్ట్రాటజిక్ సేల్ పేరుతో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని విక్రయించడానికి మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర ప్రజలందరూ వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో 30న జరిగే సభకు హాజరు కావాలని అమర్‌నాథ్‌ను కోరారు. స్టీల్‌ప్లాంట్ విక్రయాన్ని నిలిపివేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రికి మిగతా 2లో..



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

ఘనంగా బాలికా దినోత్సవం

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మంగళవారం బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జివిఎంసి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బులికృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలు స్వయం శక్తితో అన్ని రంగాలలో ఎదగాలన్నారు. ప్రభుత్వాలు బాలికల సంక్షేమం కోసం తీసుకొచ్చిన పథకాలను వివరించారు. బాలికలే దేశ అభ్యుదయానికి పునాదులని అన్నారు.

వార్తలు 6వ పేజీలో..

మొదటి పేజీ తరువాయి..

ధాన్యం కొనుగోలు అంతంతమాత్రమే..!

చేసుకోవడంతో పాటు ఇకెవైసి చేసుకోవాలన్న నిబంధనలన్నీ రైతులకు తలనొప్పిగా ఉన్నాయి. ఇన్ని తలనొప్పులు భరించే కంటే కళ్లాల దగ్గరకొచ్చి ధాన్యం కొనే వ్యాపారులకు అమ్ముకోవడం రైతుకు సులభంగా ఉంది. ఎలాగూ నిబంధనలు ఆటంకంగా మారడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల కంటే ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకొనేందుకు పలువురు ఆసక్తిచూపుతున్నారు. అందువల్ల ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 87 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అనుకున్నా 13,142 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయగలిగారు. రైతుల నుంచి ఫిబ్రవరి 15 వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలత తెలిపారు.

ఉక్కు ప్రజా గర్జనకు మద్దతివ్వండి

వివరించేందుకు కార్మిక సంఘాల నేతలను జగన్మోహన్ రెడ్డి వద్దకు తీసుకువెళ్లాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో వి.శ్రీనివాసరావు, బొడ్డు పైడిరాజు, దాలినాయుడు తదితరులు ఉన్నారు.

కలెక్టర్ మల్లికార్జునకు బెస్ట్ ఎలెక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు

నమోదుపై అవగాహన కల్పించడం, అణగారిన వర్గాలను ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం చేయడం తదితర అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ అవార్డును అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ అవార్డును మల్లికార్జున బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా జరిగే జాతీయ ఓటరు దినోత్సవంలో గవర్నర్ చేతులమీదుగా అందుకోనున్నారు.

అలాగే విశాఖపట్నం జిల్లా నుంచి గాజువాక నియోజక వర్గం ఎన్నికల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి ఉత్తమ ఎన్నికల నమోదు అధికారిగానూ, గాజువాక పోలింగ్ కేంద్రం నెంబర్ 159 బూత్ లెవెల్ అధికారి సునీత ఉత్తమ బూత్ లెవెల్ అధికారిగానూ అవార్డులు అందుకోనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, సమాచార శాఖ జెడి వి.మణిరామ్ తదితరులు మల్లికార్జునను ఆయన ఛాంబర్‌లో మంగళవారం కలిసి అభినందించారు.

28 నుంచి ఎన్‌టిఎక్స్‌పి సందడి

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : విశాఖలో నేషనల్ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి జి.మహేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 3 వరకూ జరిగే ఈ కార్యక్రమంలో మూడు రాష్ట్రాల నుంచి 200 మంది గిరిజన యువతీ యువకులు పాల్గొంటున్నారని చెప్పారు. అందులో భాగంగా రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్ ప్రాంగణంలో వారం రోజులపాటు జాతీయ స్థాయి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చత్తీష్‌ఘడ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. సిఆర్‌పిఎఫ్, ఐడిబిపి, బిఎస్ఎఫ్ ప్రతినిధులు యువతకు సహకారంగా వస్తున్నారని వెల్లడించారు. గిరిజన యువతకు సంబంధించిన భాష - సంస్కృతి, జీవన వ్యవహార శైలి, ఆర్థిక పరిస్థితులు, నివసించే పద్ధతులు, ప్రాంతాలను బట్టి వివిధ రకాల జీవన విధానాలు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

సమగ్రాభివృద్ధికి సిఎం కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సిఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. మంగళవారం సాయంత్రం నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్తరాంధ్రకు, రాయలసీమకు ఆత్మగౌరవం ఉండకూడదా ? కేవలం అమరావతిలో రియల్ ఎస్టేట్ చేసే వారికే ఆత్మగౌరవం ఉంటుందా ? అని ప్రశ్నించారు. రాజధాని అక్కడే ఉండాలని చంద్రబాబు అండ్ కో కోరుతోందని, కొందరి స్వార్థ ప్రయోజనాల కోసమే వారు ఆ డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. వికేంద్రీకరణపై మరోసారి బిల్లు ప్రవేశపెట్టాల్సిన అవసరముందన్నారు. పాదయాత్ర చేపట్టనున్న టిడిపి నేత లోకేష్ ఏనాడూ, ఏ ఒక్క ఎన్నికల్లోనూ గెలవలేదన్నారు. ఆయన ఒక రాజకీయ కమెడియన్ అని, ఆయన పాదయాత్ర కూడా కామెడీ మాదిరిగానే ఉంటుందని అన్నారు.

పాదయాత్ర కాదు.. టిడిపి పాడెయాత్ర

లోకేష్ పాదయాత్రకు వైసిపి భయపడుతోందని టిడిపి నాయకులు అనిత, బొండా, అయ్యన్న తదితరులంతా ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. మంగళవారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. లోకేష్ పాదయాత్రను టిడిపికి పాడె యాత్రగా జనం భావిస్తున్నారని ఆమె అన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు ఐక్య పోరాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఐక్య పోరాటాలు నిర్వహించనున్నట్లు విశాఖ మోటారు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు మంగళవారానికి 663వ రోజుకు చేరాయి. దీక్షల్లో మోటారు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్లు, విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రెండేళ్లకుపైగా ఉద్యమం సాగుతున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. అందుకే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ నెల 30న చేపట్టిన ఉక్కు ప్రజా గర్జన సభను విజయవంతం చేయాలని కోరారు. విశాఖ నగర అభివృద్ధిలో ఉక్కు కర్మాగారం పాత్ర ఎంతో ఉందన్నారు. కేవలం రూ.5 వేల కోట్లు పెట్టుబడిని నాడు కేంద్రం ఇవ్వగా ఉక్కు కర్మాగారం ఏర్పాటైన నుంచి ఇప్పటి



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

వరకూ వివిధ రకాల పన్నుల రూపంలో కేంద్రానికి రూ.50 వేల కోట్ల మేర చెల్లించిందని తెలిపారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) అధ్యక్షులు కె.సత్యనారాయణ, సిహెచ్.వెంకటరావు, బి.మల్లేష్, కె.త్రినాథ్, ఎల్.సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు..చిరస్మరణీయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ రచయిత ప్రొఫెసర్ కె.వెంకటేశ్వర్లు చిరస్మరణీయుడని ద్రవిడ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ కెఎస్.చలం అన్నారు. కె.వెంకటేశ్వర్లు సంస్మరణ సభ అరసం విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆంధ్ర యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఫిలాసఫీ సెమినార్ హాల్‌లో మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన చలం మాట్లాడుతూ ఫిలాసఫీలో వెంకటేశ్వర్లు పిహెచ్‌డి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తనకు ఆయన 1970 నుంచి తెలుసునని చెప్పారు. విశాఖ రచయితల సంఘంలో ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. సుమారు 50 ఏళ్ల పాటు తామంతా ఒక కుటుంబ సభ్యుల వలే ఉన్నామన్నారు. ఆయన రచయితగానే కాకుండా సామాజిక సమస్యలపైనా పోరాడారని అన్నారు. మరొక ముఖ్య అతిథి, మాజీ ఎంఎల్‌ఎ మానం ఆంజనేయులు మాట్లాడుతూ వెంకటేశ్వర్లు వామపక్ష భావజాలాన్ని నమ్మినా ఇతరులందరితోనూ ఎంతో సమన్వయంతో ఉండే గొప్ప మానవతావాది అని కొనియాడారు.

అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు స్వాగతోపన్యాసం చేశారు. సభలో ప్రొఫెసర్ క్రిష్ణయ్య, ప్రొఫెసర్ సిమ్మన్న, ప్రొఫెసర్ చందు సుబ్బారావు, డాక్టర్ నటరాజ్, డాక్టర్ కెవిఎస్, వర్మ, ఫిలాసఫీ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ వెంకటరావు, క్షేత్రపాల్ రెడ్డి, బి.అప్పారావు, రాంప్రభు, ఇస్ఫూ సుకుమారన్ పాల్గొన్నారు. శ్యామసుందర్ వందన సమర్పణ చేశారు.

గ్రంథాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగస్తులకు ఆ సంస్థ ఛైర్‌పర్సన్ కొండా రమాదేవి శుభవార్త చెప్పారు. కొందరు ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించారు. మరి కొందరికి కారుణ్య నియామకాలు చేశారు. మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దాదాపు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగోన్నతుల సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలపైనా ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగస్తులకు నియామక పత్రాలు అందజేశారు. మరింత మెరుగ్గా పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఎఫ్ఎసి కార్యదర్శి లలిత, తదితరులు పాల్గొన్నారు.

మాధవికి అభినందన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ జిల్లా విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎడిగా బాధ్యతలు చేపట్టిన జె.మాధవి మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమెను ఆయన అభినందించారు.

టిడిపికి గోడి అరుణ రాజీనామా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తెలుగుదేశం పార్టీ నేతల వైఖరిని తట్టుకోలేక బాధాతప్త హృదయంతో తెలుగు మహిళ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి, తెలుగుదేశం పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు గోడి అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగుదేశం పార్టీలో పదేళ్ల నుంచి చురుగ్గా పాల్గొంటూ నిబద్ధత, క్రమశిక్షణతో ఉన్న తనను కష్ట సమయంలో పార్టీ పట్టించుకోకపోవడం తీవ్రంగా బాధించిందని పేర్కొన్నారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుకు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు పంపించానన్నారు.



ఎంపికైన వారితో జపాన్‌కు చెందిన ప్రతినిధులు, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ నాయకులు

జపాన్ టేబుల్ టెన్నిస్ క్యాంపునకు ఎపి క్రీడాకారులు సిద్ధం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఏప్రిల్ చివరి వారంలో పది రోజుల పాటు జపాన్‌లో జరిగే టేబుల్ టెన్నిస్ క్యాంపునకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారులు టి.సూర్య తేజ, చెవిరి పాల్గున, కాజోల్ సునర్, ఎంవి.కార్తికేయలతో పాటు టీమ్ కోచ్ మురళీ మోహన్ పాత్రో ఎంపికయ్యారు. మంగళవారం విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో జరిగిన సమావేశంలో తొమ్మిది మంది జపాన్‌కు చెందిన ప్రతినిధులతో కలిసి విశాఖపట్నం రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షులు ఎంవి.జానకీ రాం ఈ క్రీడాకారుల వివరాలు ప్రకటించారు. కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అధ్యక్షులు జెకె.నాయక్, కార్యదర్శి డివిఎస్‌వై.శర్మ, ఎంపికైన క్రీడాకారుల తల్లిదండ్రులు, కోచ్‌లు పాల్గొన్నారు.

వీధి దీపాలు లేక ఇక్కట్లు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 8వ వార్డు పరిధి బిసి, ఎస్‌సి కాలనీల పరిధిలో విధిదీపాలు లేకపోవడంతో ఆయా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా కాలనీలు కొండప్రాంతంలో ఉన్నాయి. అటుగా వెళ్లే దారిలో దుర్గాదేవి గుడి రోడ్డులో వీధి దీపాలు లేక వేలాది ప్రజలు రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగాలకు వెళ్లి రాత్రిపూట ఇంటికి వచ్చే మహిళలు భయపడుతున్నారు. రాత్రి పూట కుక్కలు వెంట పడుతున్నాయి. అధికారులు స్పందించి విధిదీపాలు ఏర్పాటుచేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

5న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

ప్రజాశక్తి -అరిలోవ : 2022-23 విద్యాసంవత్సరానికి ఎన్‌ఎంఎంఎస్ పరీక్షను ఫిబ్రవరి 5న నిర్వహించనున్నట్లు జిల్లావిద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లను ప్రభుత్వ సంచాలకులు వెబ్‌సైట్ www.ap.gov.in.log ద్వారా సంబంధిత ఉపాధ్యాయులు పాఠశాల యూజర్ కోడ్‌ను ఉపయోగించి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలని సూచించారు.

సబ్‌ప్లాన్ పొడిగింపుపై హర్షం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కాలపరిమితిని రాష్ట్ర ప్రభుత్వం మరో పదేళ్ల పొడిగించడంపై స్థానిక ఎఎంసి మార్కెట్ యార్డు ఎదురుగా అంబేద్కర్ విగ్రహం వద్ద దళితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాగం లక్ష్మి, వైసిపి నాయకులు భాగం గోపాలరావు, జివి.రమణ, మాజీ సర్పంచ్ జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఇటీవల కాలంలో హ్యాకింగ్ సమస్య తీవ్రమైందని, విలువైన డేటాను హేకర్స్ చోరీ చేస్తున్నారని తెలిపారు. దీంతో సైబర్ సెక్యూరిటీ నిపుణులకు డిమాండ్ బాగా పెరిగిందన్నారు. సైబర్ పీస్ ఫౌండేషన్ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ నరసింహారావు మాట్లాడుతూ, టెక్నాలజీ పెరిగే కొద్దీ టెక్ మోసాలు కూడా అదే స్థాయిలో ఉంటున్నాయన్నారు. రానున్న కాలంలో ఈ తరహా మోసాలు ఎక్కువయ్యే అవకాశం ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో విద్యార్థి దశ నుంచే సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎ. సంతోష్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రశాంత విశాఖలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు, దోపిడీలు, దొంగతనాలు, డ్రగ్స్, మత్తు పదార్థాల నివారణకు ఆటో డ్రైవర్లు పోలీసులకు సహకరించాలని క్రైమ్ విభాగం సిఐ ఎర్రమనాయుడు కోరారు. మంగళవారం అల్లిపురం వైర్లెస్ కాలనీలో ఆటో డ్రైవర్ల సదస్సును క్రైమ్ ఎస్ఐ కె.ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. డ్రైవర్లు, పోలీసుల మధ్య ఉన్న మైత్రిని అందరూ మెచ్చుకునే విధంగా ఆటోడ్రైవర్ల ప్రవర్తన ఉండాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌సి రమణ,

2030కి దేశ విద్యుత్ రంగం సుస్థిరవృద్ధి

ఎన్‌టిపిసి విశ్రాంత అధికారి శివరామకృష్ణ

ప్రజాశక్తి -మధురవాడ : థర్మల్ విద్యుత్ ఉత్పాదనతో పాటు సంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా ఉత్పాదనను మెరుగు పరుచుకుంటూ 2030 నాటికి దేశ విద్యుత్ రంగం సుస్థిరవృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తోందని ఎన్‌టిపిసి విశ్రాంత అధికారి పి.శివరామకృష్ణ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రానున్న ఏడు సంవత్సరాలలో శిలాజ ఇంధనాల ద్వారా విద్యుత్ ఉత్పాదనను తగ్గించి ఇతర మార్గాలలో కాలుష్యం వెదజల్లని విధంగా సౌర, పవన తదితర సంప్రదాయేతర విద్యుత్ ఉత్పాదనను 64.26 శాతం మేరకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. థర్మల్ విద్యుత్ ఉత్పాదక కేంద్రాలు సైతం సౌర ఉత్పాదనపై దృష్టి సారించాయని తెలిపారు. ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో దేశంలో 199.5 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పాదన జరుగుతోందని వెల్లడించారు. థర్మల్ విద్యుత్తు ఉత్పాదనలో కాలుష్య శాతాన్ని గణనీయంగా తగ్గించారని తెలిపారు. దేశ అవసరాలకు తగిన విధంగా సౌర, పవన విద్యుత్తు ఉత్పాదన పూర్తి స్థాయిలో అందించడానికి మరికొంత కాలం పడుతుందని పేర్కొన్నారు. రానున్న 5 సంవత్సరాలలో థర్మల్ విద్యుత్తు ఉత్పాదన 35 వేల మెగావాట్లకు చేరనుందని తెలిపారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.భానుపవన్ తదితరులు పాల్గొన్నారు.

స్కై మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి -ఆనందపురం : స్కై మార్షల్ ఆర్ట్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను మంగళవారం సొంట్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. స్కూల్ గేమ్స్ ఆధ్వర్యాన గత నెలలో నెల్లూరులో జరిగిన స్కై మార్షల్ ఆర్ట్స్‌లో గిడిజాల నుంచి 11, సొంట్యాం 7, జుత్తాడ 7, పెందుర్తి 3, ఆనందపురం 2, గుడిలోవ 4, మర్రిపాలెం 3, మధురవాడ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు స్కై మార్షల్ ఆర్ట్స్ గేమ్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరిని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆనందపురం మండల వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపిపీ పాండ్రంగి శ్రీను, సర్పంచ్ లెంక రాంబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ బొదవు బంగార్రాజు, అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు ఎ.అప్పలరాము, సెక్రెటరీ ఎల్.రాము, అసోసియేషన్ సభ్యులు సంతోష్, రవి, వృక్షా ఫౌండేషన్ ఫౌండర్ కాకర సురేష్ కుమార్, మేము సైతం ఫౌండర్ ఎ.దేవుడుబాబు, ప్రధానోపాధ్యాయులు కెవి.సుబ్బారావు, సిబ్బంది, పిల్లల తల్లిదండ్రుల సమక్షంలో ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు, పలు పార్టీల నాయకులు

మార్కండేయ జయంతి

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక పద్మశాలి భవన్‌లో మంగళవారం మార్కండేయ మహర్షి జయంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. స్థానిక పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కొప్పల రమేష్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణరావు, సంఘం ప్రతినిధులు ఎం.గురునాథ్, సిహెచ్.ఋషి, ఎం.అప్పలరాజు, కె.రాంబాబు, ఎం.త్రినాథ్, జె.రాజారావు తదితరులు పాల్గొన్నారు.



మార్కండేయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రమేష్

మాదక ద్రవ్యాలతో అనర్థాలు

ప్రజాశక్తి తగరపువలస : మాదక ద్రవ్యాల వినియోగం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని ఎస్ఇబి జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక అనిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రానున్న 3 నెలల కాలంలో మాదక ద్రవ్యాలు లేని రాష్ట్రంగా తయారుకావలన్న దృఢ సంకల్పంతో పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. మాదక ద్రవ్యాలు వాడితే ఏ తరహా శిక్షలకు గురవుతారో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇబి సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు, ఇన్‌స్పెక్టర్ వి.రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చీరలు, దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : సాని కాలువ జంక్షన్ వద్ద సోమవారం రాత్రి జరిగిన తీర్థ మహోత్సవం సందర్భంగా మహిళలకు చీరలు దుప్పట్లో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆవ సోమవారం ఎంపిటీసీ సభ్యుడు ఈత బాబురావు, నాగిరెడ్డి నాగేశ్వరరావు ద్వారపురెడ్డి బాబ్జి కొరుపోలు చిన్నారావు పాల్గొన్నారు.

నేడు ఉచిత కేన్సర్ వైద్య శిబిరం

ప్రజాశక్తి - అరిలోవ : సేవాస్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యాన మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో రవీంద్రనగర్‌లోని సేవాస్ఫూర్తి భవనంలో బుధవారం ఉచిత కేన్సర్ వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు వైద్యుల పర్యవేక్షణలో ఉచిత కేన్సర్ పరీక్షలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వివాహమైన, 25 ఏళ్ల పైబడిన మహిళలకు రొమ్ము, గర్భాశయం, ఇతర కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : చిరుధాన్యాలు వినియోగించడం వల్ల ప్రతి ఒక్కరికి ఆరోగ్యం పెంపొందుతుందని నాబార్డ్ సిజిఎం ఎంఆర్ గోపాల్ అన్నారు. స్థానిక ఆచార్య ఎన్జీరంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో మంగళవారం అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలు పండించే వారికి ప్రభుత్వం అనేక రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. చిరుధాన్యాలను పండించడం వల్ల కలిగే లాభాలను ఆర్ఏఆర్ఎస్ పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికె జగన్నాథరావు, డిడిఏ మోహనరావు, హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్ ప్రభాకరరావు, ఎల్‌డిఎం సత్యనారాయణ వివరించారు. అనంతరం చిరుధాన్యాలపై ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. ముందుగా గుండాలు జంక్షన్ నుంచి నెహ్రూ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్వీడీఎస్ కార్యదర్శి కే జోగినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

బండారును కలిసిన ముత్యాలమ్మపాలెం యువత

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయితీ యువకులు మంగళవారం మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిని ఆయన నివాసంలో కలిశారు. తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ అభివృద్ధికి తాము సాయి శక్తుల కషి చేస్తామని చెప్పారు. ఆ యువకులను బండారు అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా, తెలుగు యువత నాయకులు చింతకాయల అమర్, చింతకాయల రవి, చింతకాయల సతీష్, చింతకాయల ముత్యాలు, తిత్తి పైడిరాజు, చింతకాయల మహేష్, తిత్తి మహేష్ పాల్గొన్నారు.

గాజువాకలో లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకు అవకాశం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గాజువాకలో లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకు అవకాశముందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ లేపాక్షి పర్సన్ బడిగించల విజయలక్ష్మి, జాతీయ బీసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి అన్నారు. ఎంపోరియం ఏర్పాటుకు అవసరమైన స్థలంగానీ, వ్యాపార సముదాయ భవనంగానీ కేటాయించాలని జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జునకు మంగళవారం ఆయన ఛాంబర్‌లో వారు వినతి పత్రం సమర్పించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో ఎపిహెచ్‌డిసి డైరెక్టర్ పైడి రమణ, విశాఖపట్నం లేపాక్షి ఎంపోరియం మేనేజర్ విజయ గౌరి, దయానంద పాల్గొన్నారు.

నేడు ఎయుకు చినజీయర్ స్వామి

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చినజీయర్ స్వామి బుధవారం ఉదయం రానున్నారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల హాస్టల్స్ మధ్య నూతనంగా అభివృద్ధి చేసి, విద్యార్థులకు ఉపయుక్తంగా వినియోగంలోనికి తీసుకువచ్చిన సుమారు 16 ఎకరాల క్రీడా మైదానాన్ని చినజీయర్ స్వామీజీ ప్రారంభిస్తారని ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి తెలిపారు. దాతల సహాయంతో సుమారు 9 నెలల కాలం శ్రమించి తీర్చిదిద్దిన మైదాన్ని పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందుబాటులోనికి తీసుకువస్తారు. లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ నిర్వాహకులు, ఏయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ పి.ఏసుపాదం, రాజరెడ్డి, రామకృష్ణరాజులు సహృదయతో మైదానాన్ని తీర్చిదిద్ది ఏయుకు అందించిన విషయం విదితమే. అనంతరం విద్యార్థులతో కలసి 108 ఔషధ మెక్కలను నాటే కార్యక్రమంలో స్వామీజీ పాల్గొంటారు.

మైదానంలో శక్తిస్థూపం ఏర్పాటు చేయనున్నారు. శక్తిస్థూపం నిర్మాణానికి భూమిపూజలో స్వామీజీ పాల్గొంటారు. ఈ సందర్భంగా ఏయూ క్రీడా మైదానానికి ఉర్వ అని నామకరణం చేయనున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు మనోధైర్యాన్ని అందిస్తూ, మానసిక ప్రశాంతతను అందించే దిశగా, క్రీడా మైదానంలో క్రీడలు ఆడేవారికి ఆరోగ్యం అందించే విధంగా ఈ శక్తిస్థూపం నిర్మాణం చేయనున్నారు. అనంతరం బీచ్‌రోడ్డులోని యోగా విలేజ్‌ను సందర్శిస్తారు.వి శ్వవిద్యాలయంలో పలు ప్రాంతాలలో ఔషధ మెక్కలు నాటడంపై సూచనలు ఇస్తారు.



వృథాగా పోతున్న నీరు

నెల రోజులుగా అందని తాగునీరు

- మరోవైపు మరమ్మతులతో వృథా

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో నెల రోజులుగా తాగు నీరు రాక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో బోర్లు కూడా లేవు. తాగడానికి, బట్టలు ఉతకడానికి నీరు లేకపోతే ఎలా బ్రతకాలంటూ స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక కార్పొరేటర్ దేముడు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది.

నాలుగు రోజుల క్రితం పైపులు మరమ్మతులు చేస్తామని జీవీఎంసీ సిబ్బంది వచ్చి తవ్వారు. ఈ క్రమంలో పైపు లీక్ అవడంతో నీరు వృథాగా పోయింది. రోడ్డంతా జలమయం అయింది. ప్రయాణాలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఒకవైపు నీరు లేక ఇబ్బందులు.. మరోవైపు వృథాగా పోతున్న నీటిని చూసి అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక కార్పొరేటర్ కార్పొరేటర్ చొరవ తీసుకొని గ్రామానికి నీరు అందించాలని స్థానికులు కోరుతున్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కెకె.రాజు, ఫాదర్ మనోజ్

ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ ఫెస్ట్ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్లో ఫిబ్రవరి 12వ తేదీన నిర్వహించే స్కూల్ ఫెస్ట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్ ఫాదర్ మనోజ్, సినీ హీరో ఉపకార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు వైసిపి అధ్యక్షులతో నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు, అభివృద్ధి పనులు, గృహ సారథుల నియామకంలో సేవా దృక్పథం, అంకిత భావంతో ప్రజల కోసం పని చేసే వారిని నియమించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్, నాయకులు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కారానికి వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నుంచి పలువురు కార్యాలయానికి విచ్చేసి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతులను పరిశీలించి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటిపై అధికారులకు రిఫర్ చేసినట్లు పేర్కొన్నారు.

చెత్త తొలగించాలని ఆందోళన

ప్రజాశక్తి -గాజువాక : పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని కోరుతూ తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్, స్వర్ణ సాయి, సిరి, గ్రీన్ లైఫ్ అపార్ట్‌మెంట్ వాసులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ వాసులు ఎ.చందన్, పి.శ్రీనివాసరాజు, ఎం.జైదేవ్, ఎం.నవీన్, తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలం కావాలనే ఐదు రోజులుగా చెత్తను తొలగించకుండా వదిలేసారని ఆరోపించారు. ఈ చెత్త నుంచి విపరీతమైన దుర్గంధం వ్యాపిస్తోందని తెలిపారు. శనివారం పర్యటనకు వచ్చిన జోనల్ కమిషన్ సింహాచలం చెత్త పన్ను చెల్లిస్తే తప్ప తరలించబోమని ఖరాకండిగా చెప్పారని, అపార్ట్‌మెంట్ వాసులను భయభ్రాంతులకు గురిచేసేలా మాట్లాడారని పేర్కొన్నారు. ఆస్తి పన్ను రూపంలో రూ.లక్షల్లో చెల్లిస్తున్నామని చెప్పిన సరే జోనల్ కమిషనర్ స్పందించలేదని తెలిపారు. ఇప్పటికైనా జోన్ కమిషనర్ స్పందించి అపార్ట్‌మెంట్‌లో ఉన్న చెత్తను తరలించేలా చూడాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీరి ఆందోళనకు సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, పిజె.రమేష్, టి.శ్రీనివాసరావు, క్రాంతి కుమార్, బి.నారాయణరావు పాల్గొన్నారు.



పేరుకుపోయిన చెత్త



ఆందోళన చేస్తున్న తోకాడ స్వర్ణ సాయి, సిరి, గ్రీన్ లైఫ్ అపార్ట్‌మెంట్ వాసులు

ప్రజాసేవే మక్కువ : పివి.సురేష్

ప్రజాశక్తి -ములగాడ : ప్రజా సేవ చేయటం తనకు ఎంతో మక్కువ అని పివిఎస్ హెల్పింగ్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పివి సురేష్ అన్నారు. మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జివిఎంసి 58వ వార్డు పరిధి శ్రీహరిపురం పిలకవానిపాలెంలో ఉన్న వైష్ణవి ఫంక్షన్ హాల్లో పివిఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్నవారికి రక్తం అందించాలనే తాపత్రాయంతో ట్రస్ట్ వార్షికోత్సవం సందర్భంగా ఏటా మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజకీయాలకతీతంగా జరిగే ఈ రక్తదాన్ని శిబిరాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎంతోమందికి విద్య, వైద్యం, అనాథ మృతులకు అంతక్రియలు, సేవా కార్యక్రమాలను ట్రస్టు ద్వారా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ట్రస్ట్ ద్వారా పదివేల యూనిట్ల రక్తాన్ని సేకరించి అనేక మందికి పునర్జన్మను ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పివి.సురేష్

27న జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : విశాఖ జిల్లాలోని అపోలో హోమ్ కేర్ సంస్థలలో 50ఖాళీల భర్తీకి ఈ నెల 27వ తేదీఉదయం 10 గంటలకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ (టెక్నికల్) ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంస్థలలో హోమ్ కేర్ నర్సు ఉద్యోగాలకు జిడిఎ, ఎఎన్ఎం, జిఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగి, 18 నుంచి 35 మధ్య వయసుగల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.12,500 నుంచి రూ.28,500 వరకు జీతం ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్లతో జిల్లా ఉపాధి కల్పన కారాయలయానికి హాజరు కావలసిందిగా కోరారు. ముందుగా తమ వివరాలను ncs.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని జాబ్ మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు.

ప్రజాగర్జన విజయవంతానికి ప్రచారం



స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల్లో ప్రచారం నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉక్కునగరం :ఉక్కు త్రిష్నా గ్రౌండ్‌లో ఈ నెల 30వ తేదీన జరిగే ఉక్కు ప్రజా గర్జన బహిరంగ సభలో ఉక్కు కాంట్రాక్టు కార్మికుల కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఎల్‌ఎంఎంఎం పార్కు వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాల్లో ప్రచార కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 32 మంది బలిదానంతో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో పోరాడి సాధించుకున్న స్టీల్‌ప్లాంటను ఎట్టిపరిస్థితిలోనూ ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఒవి రావు, జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ, బొడ్డ గోవిందు, పిట్టా రెడ్డి, మురళీకృష్ణ, సత్యారావు, త్రినాథ్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి, డి.పాండే, కె.సత్యవతి, యు.సోమేష్, పి.మసేను, చట్టి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస :ఉక్కు ప్రజా గర్జనను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఐ భీమిలి ఏరియా సమితి ఆధ్వర్యాన మంగళవారం స్థానిక జంక్షన్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఉక్కు కార్మికులు చేస్తున్న ఉద్యమానికి రెండేళ్లు అవుతున్న సందర్భంగా చేపట్టే కార్మిక గర్జనను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్య వర్గ సభ్యులు ఎస్‌కె రెహమాన్, జిల్లా నాయకులు అల్లు బాబూరావు, ఎమ్‌డి బేగం, వి.సత్యనారాయణ, కానూరి రాంబాబు, ఎం.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే రద్దుచేయాలని ఎఐటియుసి డిమాండ్ చేసింది. ఈ మేరకు సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద ఎఐటియుసి ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా కార్యదర్శి జి.వామనుమూర్తి, సిపిఐ జిల్లా సభ్యులు పడాల గోవింద్ మాట్లాడుతూ, ప్రజాగర్జనలో కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బిజెపి ప్రభుత్వం కళ్లు తెరిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రావికృష్ణ, ఆర్.అశోక్, నక్క సూర్యనారాయణ, బి.దుర్గారావు, పి.రాము తదితరులు పాల్గొన్నారు.



తగరపువలసలో సిపిఐ ప్రదర్శన

ప్రత్యేక హోదా, విభజన హామీలపై సమర యాత్ర

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు అనంతపురం నుంచి ఇచ్ఛాపురం వరకు సమర యాత్ర నిర్వహించనున్నట్టు విద్యార్థి యువజన సంఘాల ప్రతినిధులు వెల్లడించారు. స్థానిక కోడిగంటి గోవిందరావు భవనంలో మంగళవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనుకబడ్డ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు వంటి వాటిని తుంగలో తొక్కారని విమర్శించారు. వీటిని ప్రశ్నించాల్సిన అధికార వైసిపి, విపక్ష టీడీపీ పార్టీలు బిజెపికి తోకగా మారిపోయాయని విమర్శించారు. యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు లేక చెడు తోవ పట్టే ప్రమాదం ఉందన్నారు. ఉద్యోగాలు రావాలంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు వైసిపి టిడిపి జనసేనకు చిత్తశుద్ధి ఉంటే ఈ ఉద్యమంలో కలిసి రావాలన్నారు. అనంతరం సమర యాత్ర పోస్టరును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగ రమణ, నాయకులు తరుణ్, మౌనిక అనిత, డివైఎఫ్ఐ నాయకులు నాయుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కన్నబాబు, వి రాజు, హరీష్, పిడిఎస్ఓ రాష్ట్ర నాయకులు భాస్కర్, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వై ఎన్ భద్రం, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు చిన్ని యాదవ్, మాణిక్యాలరావు, హరినాథ్ బాబు, అప్పారావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నేతలు



రోగులకు మందులు అందజేస్తున్న ఎన్‌టిపిసి జిఎం సిన్హా

ఎన్‌టిపిసి సహకారంతో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-పరవాడ : ఎన్టీపిసి సింహాద్రి సిఎస్ఆర్ ఇనిషియేటివ్స్ కింద హెల్పేజ్ ఇండియా సహకారంతో మంగళవారం కలపాకలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కలపాక పంచాయతీ పరిధిలోని బొబ్బిలి, ఎం.స్వయంభువరం, పెద స్వయంభువరం, మార్సివానిపాలెం, కలపాక, గొల్లలుపాలెం గ్రామాల ప్రజలు ఈ శిబిరానికి హాజరయ్యారు. ఈ వైద్య శిబిరంలో గైనకాలజీ, డెంటల్, డెర్మటాలజీ, పీడియాట్రిక్స్, జనరల్ ఫిజీషియన్ తదితర వైద్య సేవలు అందించారు. రోగులకు బిపి, షుగర్ పరీక్షలు చేశారు. ఎన్టీపిసి సింహాద్రి గ్రూప్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ అంజు సిన్హా రోగులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిపిసి ఏజీఎం రుమా డి శర్మ, డాక్టర్ ఎకె దాస్మోహపాత్ర, సిఎమ్ఒ అనిత్ కుమార్, కె.ప్రకాశ రావు, కలపాక సర్పంచ్ బొండా కనకారావు స్థానిక నాయకులు పాల్గొన్నారు



ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు

జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-చోడవరం : ఈ నెల 22, 23 తేదీల్లో గాజువాక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో చోడవరం, అనకాపల్లికి చెందిన క్రీడాకాలరు ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో చోడవరం క్రీడాకారులు 23, అనకాపల్లి క్రీడాకారులు 10 బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా త్త్వైక్వాండో అసోసియేషన్ ఇన్‌ఛార్జి పల్ల మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఈ నెల 29 నుండి 31 తేదీ వరకు అనకాపల్లిలో జరగబోయే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన క్రీడాకారులను, కోచ్‌లు దూలం వెంకట రమేష్, ప్రదీప్ కుమార్, ఎస్‌కె.ఆలీ, ఎం.సంతోషి, లక్ష్మి, శేఖర్‌ను తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ టి హర్ష వర్ధన్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి పి.గణేష్ కమార్, కోశాధికారి చవల చంద్ర శేఖర్ అభినందించారు.

దేశభక్తిని పెంపొందించేలా కార్యక్రమాలు

ప్రజాశక్తి- అనకాపల్లి : రిపబ్లిక్ డే దినోత్సవాలను పురస్కరించుకొని ప్రజలు విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే విధంగా భారీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు గుడ్ షెఫర్డ్ ఇంగ్లీష్ మీడియం కరస్పాండెంట్ పాల్ ధర్మదాస్ తెలిపారు. పాఠశాలలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే తమ పాఠశాలలో 1000 అడుగుల జాతీయ పతాకం ప్రదర్శన, కార్గిల్ యుద్ధ ప్రదర్శన, భారత స్వాతంత్రోద్యమం వంటి పలు కార్యక్రమాలను వినూత్న రీతిలో ప్రదర్శించి పట్టణ ప్రజల మన్ననలు అందుకోవడం జరిగిందని తెలిపారు. 26న పతాకావిష్కరణ అనంతరం పాఠశాల ప్రాంగణంలో 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన విద్యార్థుల ప్రతిభతో రూపొందించి స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. భిన్నత్వంలో ఏకత్వం చాటి చెప్పేందుకు 28 రాష్ట్రాలు 8 కేంద్ర పాలిత ప్రాంతాల ఆచార వ్యవహారాలు, ఆయా రాష్ట్రాల నాయకులు, రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించిన గొప్ప వ్యక్తుల వేషధారణలు ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ స్టాల్స్ సందర్శకులకు గుడ్ షెఫర్డ్ స్కూలు లక్కీ డ్రా ద్వారా ప్రథమ బహుమతిగా ట్యాబ్, ద్వితీయ బహుమతిగా గ్రైండర్, తృతీయ బహుమతిగా స్మార్ట్ వాచ్ బహుకరించడం జరుగుతుందని చెప్పారు.

ఎపిజివిబి సేవలపై అవగాహన

ప్రజాశక్తి- అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు రీజనల్ మేనేజర్ ఉదయ కిరణ్, సీనియర్ మేనేజర్ ఆనందరావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో 2023 చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో గ్రామీణ ప్రజలకు బ్యాంకు అందిస్తున్న సేవలను కూడా వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ కుప్పిలి వెంకట శ్రీనివాసరావు, రీజనల్ కార్యాలయ సిబ్బంది మురళి, వాలి, బాషా పాల్గొన్నారు.

క్షయ రోగులకు చేయూతనివ్వాలి



పోష్టికాహారం అందజేస్తున్న కలెక్టర్, డిఎం అండ్ హెచ్‌ఒ

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రధానమంత్రి టీవీ ముక్త భారత్ అభియాన్ పథకానికి విరాళాలు ఇచ్చి క్షయ రోగులను ఆదుకోవాలని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి కోరారు. స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని 40 మందికి పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా 476 మంది టిబి రోగులను దత్తత తీసుకున్న హెటిరో ఫౌండేషన్ యాజమాన్యాన్ని అభినందించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ హేమంత్ మాట్లాడుతూ టీవీ రోగులను దత్తత తీసుకునేందుకు అధికారులు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. హెటిరో ఫౌండేషన్ రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రావణ్ కుమార్, హెటిరో సంస్థ ప్రతినిధులు పుల్లారెడ్డి, సుబ్బారెడ్డి, టిబి మెడికల్ ఆఫీసర్ కష్ణ కుమార్, డిఐఓ మురళీధర్, ఐఎంఏ డాక్టర్లు బెనర్జీ, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

108 సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ అనకాపల్లి కలెక్టరేట్ ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా 108 ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు జిటిఎస్ ప్రసాద్, అనకాపల్లి డివిజన్ కార్యదర్శి వర్రి శ్రీరామ్మూర్తి, సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి గతంలో ఇచ్చిన హామీ మేరకు 108లో ఉద్యోగులుగా పనిచేస్తున్న ఈఎంటి, పైలట్లను వైద్య ఆరోగ్య శాఖలో కాంటాక్ట్ ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ నియామకాల్లో సంబంధిత విద్యార్హత, ప్రమాణాలు కలిగిన 108 సిబ్బందిని సర్వీస్‌ను బట్టి వెయిటేజీ మార్కులు ఇవ్వాలని కోరారు. అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్ సంస్థ వచ్చిన తర్వాత అక్రమంగా వివిధ కారణాలతో 108 సిబ్బందిని తొలగించారని, వారిని తక్షణమే విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, నర్సీపట్నం డివిజన్ సెక్రెటరీ ప్రకాష్, అనకాపల్లి జిల్లా కమిటీ సభ్యులు ఉమా మహేష్, జి సంజీవరావు, సిఐటియు నాయకులు గని శెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణమూర్తి తీర్థం



సత్యనారాయణమూర్తి కొండపైకి తరలివెళ్తున్న జనం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని పెద నందిపల్లిలో విజయ వెంకట సత్యనారాయణమూర్తి స్వామి తీర్థ మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల నలమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం గ్రామంలో భారీ అన్న సమారాధన జరిగింది. రాత్రి గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు సత్య దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, కాశీపురం సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, తదితరులున్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో శతకం పట్టు రామకోవుల వద్ద ఉన్న సీతారాముల తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు మొక్కులు తీసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల పందెం, సాయంత్రం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. రాత్రి కుమార్ వారి వీధి యువకులచే సాంఘిక నాటకం, విశాఖ వారిచే డ్యాన్స్ బేబీ డ్యాన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దాడి ఎరుకు నాయుడు, సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజ శ్రీనివాసరావు, పాల సంఘం అధ్యక్షులు కుమార వెంకటరమణ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం పంచాయితీ శివారు అదిరెడ్డి పాలెం గ్రామంలో సీతారాముల తీర్థ మహోత్సవం సందర్భంగా గొర్లి ప్రసాద్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, కోటాన రాము మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ క్రీడల్లో జిల్లాలోని 14 టీములు పాల్గొన్నాయి. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.8వేలు, ద్వితీయ బహుమతిగా రూ.6 వేలు, తృతీయ బహుమతిగా రూ.4 వేలు, నాలుగో బహుమతిగా రూ.2వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎం.లక్ష్మణరావు, వైసీపీ నేతలు సబ్బవరపు నారాయణ మూర్తి, గొంప దేముడు, యడ్ల నాయుడు, ముడ్డు సూర్యనారాయణ పాల్గొన్నారు.

కేలండర్, డైరీల ఆవిష్కరణ

ప్రజాశక్తి- దేవరాపల్లి : పంచాయతీ కార్యదర్శుల సంఘం రూపొందించిన నూతన సంతవ్సర కేలండర్, డైరీలను రాష్ట్ర డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంగళవారం ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బలక్ష్మి, జడ్పిటిసి సభ్యుడు కర్రి సత్యం, మండల పరిషత్ పరిపాలన అధికారి జివి.రమణ, ఈఓపిఆర్‌డి కె.ఉషాశ్రీ, మండల పంచాయితీ కార్యదర్శుల అధ్యక్షురాలు నళిని, 27 పంచాయతీల కార్యదర్శులు, ఎంపీడీవో ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులు కారణంగా ఈ 25వ తేదీన స్థానిక సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఏఈ గోపి తెలిపారు. 26న విద్యుత్ పునరుద్ధరణ జరుగుతుందని, కావున వినియోగదారులు, రైతులు క్రషింగు వంటి పనులను వాయిదా వేసుకోవాలని సూచించారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ఉప్పవరం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ పేర్లు మార్పులు తదితర వాటిని అందించే సేవలను వినియోగించుకోవాలని సర్పంచ్ పిన్నమరాజు వాసు అన్నారు. ఆధార్ కార్డులో ఫోన్ నెంబర్లు అప్డేట్ చేయటం వంటి సేవలు అందించడానికి సచివాలయంలో ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శి ఫణింద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలతో ఎంపిపి సూరిబాబు, వైసిపి నేత దిలీప్ కుమార్

క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

కీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ అన్నారు. మండలంలోని మార్టూరు గ్రామంలో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన శిరసపల్లి, పూడిమడక, మార్టూరు టీములకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.50వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు నగదు బహుమతి, ట్రోఫీలను అనకాపల్లి మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబుతో కలసి దిలీప్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కరణం రెవెన్యూ నాయుడు, ఎంపీటీసీ సభ్యులు మిద్దె రాజా చంద్రరావు, ఏఎంసి డైరెక్టర్ ఒమ్మి మధు, క్రికెట్ పోటీల నిర్వాహకులు మిద్దె హేమంత్, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బహుమతి అందుకుంటున్న విజేత జట్టు

సీతంపేటలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి- దేవరాపల్లి

మండలంలోని నాగయ్యపేట పంచాయితీ శివారు సీతంపేట గ్రామంలో మరిడిమాంబ తీర్థ మహోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు పైలా ప్రసాదరావు రెండో వీటిని ప్రారంభించారు. ఈ కబాడీ పోటీలను వీక్షించేందుకు ఇటు విశాఖ జిల్లాతో పాటు విజయనగరం జిల్లా నుంచి భారీగా తరలివచ్చారు. వేపాడ మండలం బక్కునాయుడు పేట జట్టు ప్రథమ బహుమతి గెలుచుకుంది. వారికి ఆ గ్రామ యూత్ తరపున రూ.20వేలు బహుకరించారు. 2వ స్థానంలో నిలిచిన బొడ్డపాడు జట్టుకు పైలా ప్రసాదరావు ఆర్థిక సాయంతో రూ.15వేలు, 3వ బహుమతి సాధించిన గంగవరం జట్టుకు గొంప వెంకటరావు రూ.10 వేలు విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జెక్కన సింహాచలమ్మ, నాయకులు కర్రి నాయుడు, కర్రి శ్రీను, గాడి సూర్యనారాయణ, పరవాడ రవి, అల్లు నరసింహమూర్తి, ఎన్. గోపి, జెక్కన సతీష్, పరవాడ అప్పారావు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

యువత వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉన్నత ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఎంపీడీవో సువర్ణ రాజు అన్నారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో మంగళవారం స్కిల్ డెవలప్మెంట్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న స్కిల్ డెవలప్మెంట్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు దాకారపు నాగరాజు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎంపిడిఒ సువర్ణరాజు

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

జాతీయ బాలికా దినోత్సవాన్ని మంగళవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

ఆరిలోవ : చినగదిలి ప్రభుత్వ బాలికల వసతి గృహంలో బాల వికాస ఫౌండేషన్ ఆధ్వర్యాన జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల వికాస ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, భరణికాన రామారావు, వసతి గృహం అధికారి ఎవిఎస్.సునీత, డాక్టర్ బాబ్జీ పాల్గొన్నారు.

పెందుర్తి: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శాఖ గ్రంథాలయం ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు బి.సుజాత, గ్రంథాలయాధికారి బి.సూర్యకళ, ఎ.ఆదినారాయణ, బాలికలు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి రాయిపాలెం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం జయంతి రాధాకుమారి ఆధ్వర్యాన, ఒకటో వార్డు పరిధి బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం రెడ్డిపల్లి అప్పలరాజు అధ్యక్షతన బాలికా దినోత్సవాలు నిర్వహించారు. భీమిలి మండలం, చిప్పాడ జెడ్‌పి హైస్కూల్‌లో హెచ్‌ఎం రేఖ అప్పారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాళ్ళవలస పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శోభారాణి, డాక్టర్ సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు. బాలికా దినోత్సవం ప్రాధాన్యతను తెలిపేలా ఆయా పాఠశాలల్లో విద్యార్థినులు ముగ్గులు వేశారు.

ఆనందపురం : కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికా దినోత్సవం నిర్వహించారు. డిసిడిఒ డాక్టర్ ఖలీశా బేగమ్ బాలికలను ఉద్దేశించి ప్రసంగించారు సెల్ఫ్ డిఫెన్స్ అంశంపై విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ ప్రత్యేక అధికారి చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక బాలయోగి గురుకులం వద్ద వేములపూడి శ్రీ వేమ స్వచ్ఛందసంస్థ, అనకాపల్లి కనకం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర అంశంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు శ్రీ వేమ సంస్థ కార్యదర్శి బోలెం శివ



కె.కోటపాడులో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, లింగవివక్షను ఎదుర్కోవడం, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈసందర్భంగా మొక్కలు నాటారు. బాలికలకు న్యూట్రీషన్ ఫుడ్ అందజేశారు.

నర్సీపట్నం టౌన్ : యువతులను ప్రభావితం చేసే సామాజిక సమస్యల నుంచి విముక్తి కల్పించేలా చుట్టూ ఉన్నవారు సహకరించాలని ఐసిడిఎస్ ఎసిడిపిఒ శ్రీగౌరీ అన్నారు జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మండలంలోని వేములపూడి కేజీబీవీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు సరోజినీ రామలక్ష్మి, రమణమ్మ, స్థానిక పిహెచ్‌సి డాక్టర్ అనూష, హెచ్‌వి పివి.లక్ష్మి, సూపర్వైజర్ ఎం రుక్మిణి మహిళా పోలీసు సోము దేవి, స్కూల్ ప్రిన్సిపల్ శాంతి, అంగన్వాడీ కార్యకర్తలు ఆశాజ్యోతి దేవి, రేవతి ఎర్రి అమ్మ, బివి లక్ష్మి, సరోజిని పాల్గొన్నారు

కోటవురట్ల : జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సచివాలయ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు, కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనిల్ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొండబాబు,ఎంపిటిసి పి సూర్యారావు, వార్డు సభ్యులు జానకి హరిబాబు పాల్గొన్నారు.

మాకవరపాలెం. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మాకవరపాలెం హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిడిపిఒ సుజాత స్త్రీ ప్రాముఖ్యత, బాలికల ఔన్నత్యం, సమాజంలో మహిళల ఆధిపత్యం, వివిధ ఉద్యమాల్లో మహిళల పాత్ర, సాధించిన విజయాలపై విద్యార్థులకు వివరించారు. హెచ్‌ఎం అచ్యుతరామయ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఆర్ సత్యవతి, ధనమ్మ పాల్గొన్నారు

గొలుగొండ : జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎఎల్‌పురంలో పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ఎస్.గాయత్రి, డాక్టర్ హరిప్రవీణ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలను రక్షించుకుందామంటూ నినాదాలు చేశారు. అనంతరం మానవహారం చేపట్టారు.కార్యక్రమంలో అంగన్వాడీలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి : సమాజంలో లింగ వివక్షపై అవగాహన ఉండాలని, లింగ వివక్షను రూపుమాపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఎంఏఎల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి జయ బాబు అన్నారు. కళాశాలలో మంగళవారం కళాశాల మహిళా సాధికారత విభాగం, ఎన్ఎస్-ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ మహిళల పట్ల చిన్న చూపు సరికాదని, భ్రూణ హత్యలు రూపు మాపేలా సమాజంలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం బాలికలను రక్షిద్దాం, కాపాడుకుందాం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.హరిబాబు, మహిళ సాధికారత విభాగం కన్వీనర్ సామ్రాజ్యం, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ నిరంజన్, కళాశాల సూపరింటెండెంట్ అనురాధ, కెమిస్ట్రీ విభాగాధిపతి శ్యామల పాల్గొన్నారు.

కె.కోటపాడు : బాలికలు కుటుంబానికి కాకుండా సమాజానికి వెలుగు లాంటి వారిని ఎంపీడీవో కె.శచిదేవి అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలురు కన్నా బాలికలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని, వారిని ప్రోత్సహించవలసిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మంగతాయారు, ఐకెపి ఎపిఎం శ్రీలక్ష్మి, బిపిఏ వెంకటరావు, కె కోటపాడు దేవరాపల్లి మండలాల అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

వడ్డాది : సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాత్యాలను ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఎదుర్కోవాలని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి కోసూరి అన్నపూర్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వడ్డాది కెజిబివి, ఎంపిపి మెయిన్ స్కూల్, మంగళాపురం ఎంపీపీ స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం టివి శేషగిరి, మహిళ పోలీస్ మహాలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు రాధాలక్ష్మి, అమ్మాజీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన వారికి సంక్షేమ పథకాలు



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-కశింకోట

అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కశింకోట సచివాలయం-4 కుమ్మరి వీధి శివాలయం, కోమటవీధి ప్రాంతాల్లో మంగళవారం వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ళ బుల్లి బాబు ఆధ్వర్యంలో మంత్రి అమర్‌నాథ్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డీవీధిలో రూ.30 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి సరఫరా వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. పంచాయతీ కార్యాలయం వద్ద స్వామి వివేకానంద విగ్రహన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, సర్పంచ్ మంత్రి జయరజని, జడ్పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఉపసర్పంచ్ నడిపల్లి లక్ష్మి నాయుడు, ఎంపీటీసీ చేవ్వేటి చంద్రమ్మ, మంత్రి పీటర్ వైజమెన్ పాల్గొన్నారు.

పరవాడ : జివిఎంసి 79వ వార్డు లంకెలపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ మంగళవారం నిర్వహించారు. ప్రజల నుండి అనేక సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అన్నంరెడ్డి అజయ్ రాజ్, అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, సుందరపు అప్పారావు, దాసరి తాతారావు, యలమర్తి వెంకట రావు, కింతాడ ఈశ్వరరావు, జి పూర్ణనందాశర్మ, శీలం నదియా, ఆశాజ్యోతి, కర్రి అప్పారావు, కతా నూకరాజు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని మార్టూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులను కలిశారు. పాఠశాలలో గుడ్డు పెడుతున్నారా, భోజనాలు బాగుంటున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, జెడ్పిటిసి సభ్యులు లా లం రాంబాబు, వైసిపి నాయకులు దేశంశెట్టి శంకర్రావు, కోన బుజ్జి, కె.విమలా నాయుడు, రాజాన పైడిభాస్కరరావు, సర్పంచ్ కె రమేష్ బాబు, స్థానిక నాయకులు కెవి రమణ, కేకే శ్రీనుబాబు, గుర్రం అప్పారావు పాల్గొన్నారు.



చేతులు జోడించి ప్రజలకు దండం పెడుతున్న వర్మ

వాడ్రాపల్లిలో 'పొలంబడి'

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ తులసి స్థానిక రైతులకు చీడపీడల నుండి పంటలను కాపాడుకునేందుకు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, రైతులు బొడ్డేడ సత్యనారాయణ, కొయిలాడ దశావతారం, కాండ్రేగుల లక్ష్మణరావు, కోయిలాడ రమణబాబు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలాల్లో నివాసముంటున్న వారికి పన్నులు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పంచాయతీలో ఎప్పటినుండో నివాసం ఉంటున్న పేదలకు స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆదేశాల మేరకు వారి ఉంటున్న స్థలాలకు, ఇళ్లకు పంచాయతీ పన్నులు వేసి వారికి అధికారికంగా ఆ స్థలాన్ని దక్కేటట్లు చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎర్ర చెరువు ఎడ్ల వీధి తామర చెరువు తదితర ప్రాంతాల్లో నివాసముంటున్న పేదలు ఎన్నో ఏళ్లగా నివాసం ఉంటున్నామని తమకు ఎటువంటి ఆధారం లేకపోవడంతో పక్కా ఇల్లు నిర్మించుకోవడానికి వీలు లేకుండా పోయిందని ఎమ్మెల్యే ధర్మశ్రీకి మొరపెట్టుకున్నారు. దీంతో ఆయన పంచాయతీ, రెవెన్యూ అధికారులను ఆదేశించి వారు ఉంటూ ఉన్న స్థలాలకు ఎల్పీసీలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఒ నారాయణరావు, సర్పంచ్ బండి శ్రీను, వైసిపి నాయకులు ఓరుగంటి నెహ్రూబాబు, మధు, జైరాం, నిఖిల తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పన్ను డిమాండ్ నోటీసులు ఇస్తున్న అధికారులు

ఉక్కు మహాగర్జనను జయప్రదం చేయండి



సంఘీభావ దీక్షలో మాట్లాడుతున్న వెంకటరమణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : విశాఖ ఉక్కు కార్మిక మహాగర్జనను జయప్రదం చేయాలని స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో సంఘీభావ దీక్షను సిపిఐ సీనియర్ నేత మాకిరెడ్డి దేముడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ 32మంది ప్రాణత్యాగం, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపిల రాజీనామాలు, ఇంకెందరో పోరాటంతో సాకారమైన ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు పరిశ్రమను బిజెపి ప్రభుత్వం దుర్మార్గమైన ఆలోచనలతో కార్పొరేట్ కంపెనీలైన పోస్కో, ఆదానీ, అంబానీలకు కట్టబెట్టాలని చూస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై రణభేరి మోగించడానికి ఈనెల 30న విశాఖలో చేపట్టే మహా గర్జనకు సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు ఇతర ప్రజా సంఘాలు విద్యార్థులు మేధావులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఎల్వి. రమణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు మాకిరెడ్డి రామునాయుడు, రాజాన దొరబాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మీసాల సుబ్బన్న, సీనియర్ లాయర్ ప్రకాష్, ఆర్. సత్యనారాయణ కార్యవర్గ సభ్యులు జి గురు బాబు, రెడ్డిపల్లి అప్పలరాజు వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు శివలంక కొండలరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు జి. రాధాకృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి, నాయకులు సుబ్బలక్ష్మి, భవాని, మండల కార్యదర్శి పాల్గొన్నారు

'22ఏ' కష్టాలు తీరేదెన్నడో..?

- క్రయవిక్రయాలకు ఆస్కారం లేని వేలాది ఎకరాలు
- అత్యవసర పరిస్థితుల్లో భూయజమానుల అవస్థలు
- ఏళ్ల తరబడి పట్టించుకోని అధికారులు, నేతలు



ప్రజాశక్తి -కోటవురట్ల : మండల వ్యాప్తంగా కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న '22ఏ' భూములతో ప్రజలు నానాఅవస్థలు పడుతున్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2016 తర్వాత '22ఏ' పరిధిలోకి మండల వ్యాప్తంగా వేలాది ఎకరాలు భూములు వెళ్లిపోవడంతో, అవి క్రయవిక్రయాలు జరగక భూయజమానులు, హక్కుదారులు అవస్థలు పడుతున్నారు. ఎస్‌సి, ఎస్‌టి బలహీన వర్గాలకు సంబంధించిన కేటాయించిన భూములు సహ దేవాదాయ, ఇనాం, వక్ఫ్, ప్రభుత్వ, పోరంబోకు భూములు సైతం '22ఏ'లో చేర్చడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఎంతటి అత్యవసర పరిస్థితి వచ్చినా వాటిని భూ యజమాని అమ్ముకునే హక్కు లేకపోవడం, కొనేవారు సైతం ముందుకు రాకపోవడంతో ఈ సమస్య ఏళ్లతరబడి ప్రహసనంగానే సాగుతోంది.

మండల వ్యాప్తంగా 20 రెవెన్యూ గ్రామాల పరిధిలోని25 గ్రామపంచాయతీల గ్రామాల్లో '22ఏ' భూములు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలుపుతున్నారు. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, అనారోగ్య సమస్యలు, ఇతరత్రా అత్యవసర పరిస్థితుల్లో ఈ భూములను అమ్ముకునే హక్కు భూయజమానికి లేకుండా పోయింది. 40,483.80 ఎకరాల విస్తీర్ణం కలిగిన మండలంలో పట్టా భూమి 28,588.80 ఎకరాలుండగా, వాటిల్లో ప్రభుత్వ భూమి 8081.93 ఎకరాలు, అటవీ భూమి 3012.66 ఎకరాలు ఉంది. ఇందులో గ్రామాల వారీగా చూస్తే 22ఏ భూముల వివరాలు ఎకరాల్లో విస్తీర్ణం ఇలా ఉంది. అన్నవరంలో 312.21 ఎకరాలు, బికెపల్లిలో 851.21, బోడపాలెంలో 464.28, చిన్న బొడ్డేపల్లిలో 227.03, చౌడువాడలో 189.22, గొట్టువాడలో 550 13, జల్లూరులో 343.28, కైలాసపట్నంలో 11 28.58, కొడవటిపూడిలో 448.80, కోటవురట్లలో 807.92, రంగాపురంలో 654.29, పాములవాకలో 291.58, పిరామన్నపాలెంలో 37.32, పొందూరులో 38 99.51, పీకే పల్లిలో 13 16.43, రాజుపేటలో 213.15, సుఖపూరులో 105.47, టీ జగ్గంపేటలో 11 94.02, తంగేడులో 339.52, ఎండపల్లిలో 275. 38 ఎకరాలు కలుపుకుని మండల వ్యాప్తంగా 14,650 ఎకరాల భూమి 22ఏలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు అంటున్నారు. వీటిల్లో పధానంగా చిన్న సన్నకారు రైతులు కూడా ఉండగా కొన్ని గ్రామాల్లో ఆయా భూముల్లో సొంతంగా ఇల్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్న వాళ్ళు ఉన్నారు. దీనిపై తహశీల్దార్ జానకమ్మను వివరణ కోరగా, 22ఏ పరిధిలో ఉన్న భూముల సమస్యకు సంబంధించి విధానపరమైన మార్గదర్శకాలు అనుసరించి సంబంధిత అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. వారి సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై సదస్సు

ప్రజాశక్తి-రోలుగుంట : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 26 గణతంత్ర దినోత్సవం రోజు నుంచి అన్ని గ్రామాల్లో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని ఇఒపిఆర్‌డి మల్లికార్జునరావు కోరారు. మంగళవారం ఎంపిడిఒ ప్రభాకరరావు అధ్యక్షతన ప్లాస్టిక్ నిషేధంపై అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలు ప్లాస్టిక్ రహితం కావాలన్నారు. దీనిపై గ్రామాల్లో ఫ్లెక్సీలు, ప్లాస్టిక్ సంచులు వినియోగించకుండా కార్యదర్శులు, వీఆర్‌ఓలు చర్యలు చేపట్టాలన్నారు.

దళిత మహిళను మోసగించిన వారిని
అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న సాయికుమార్

ప్రజాశక్తి- మాకవరపాలెం: మండలంలో దళిత మహిళ బంగారు లక్ష్మిని మోసం చేసిన వారిని అరెస్ట్ చేయాలని మండల రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి మండల కార్యదర్శి శెట్టి సాయికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కొండలఅగ్రహారంగ్రామంలో దళిత మహిళ ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడుతూ, దీనిపై ఎలమంచిలి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. తక్షణమే బాధ్యులను అరెస్ట్ చేయాలని, లేకుంటే ఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగంపల్లి లక్ష్మణ్, డి రత్నం, చిన్న పాల్గొన్నారు

రహదారి భద్రతపై అవగాహన



నర్సీపట్నంలో అవగాహనా ర్యాలీ



కశింకోటలో మాట్లాడుతున్న సిఐ రవికుమార్

ప్రజాశక్తి -పాయకరావుపేట : రహదారి భద్రత నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అనకాపల్లి జిల్లా రవాణా అధికారి ఎమ్.వీర్రాజు, డిఎస్‌పి ప్రవీణ్ కుమార్ అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీప్రకాష్ విద్యాసంస్థల ఆవరణలో బస్సు డ్రైవర్లు, విద్యార్థులతో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. రోడ్డుపై ప్రయాణించే వారు తగిన జాగ్రత్తలు తీసుకుంటే సురక్షితంగా గమ్యస్థానాలను చేరుకోవచ్చన్నారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించే బాధ్యత విద్యార్థులు చేపట్టాలని పిలుపునిచ్చారు.రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ఆసుపత్రికి చేర్పిస్తే ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతులు అందిస్తుందన్నారు. ఈ విషయంలో కేసులకు బాధ్యులమౌతామన్న అపోహను వీడాలన్నారు. అనంతరం రహదారి భద్రతా నియమాలను పాటిస్తామని విద్యార్థులు, డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంవిఐ ఎస్‌వీఆర్ మూర్తి, ఎస్ఐ రమేష్, ప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్ హెచ్‌ఆర్‌వివిఎస్‌బి బంగార్రాజు, ట్రాన్స్‌పోర్టు ఇన్‌ఛార్జి సుబ్బారావు నాయుడు పాల్గొన్నారు.

నర్సీపట్నం :రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా వాహనదారులు, ఆటో డ్రైవర్లతో నర్సీపట్నం రవాణాశాఖ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖాధికారి వెంకటరావు మాట్లాడుతూ, 90శాతం రోడ్డు ప్రమాదాలు మానవతప్పిదాల వల్లే జరుగుతున్నా యన్నారు. అతివేగం, ట్రాఫిక్ నిబంధనలను పాటించక పోవడం, మద్యం మత్తులో వాహనాలు నడపడం కూడా ప్రమాదాలకు కారణమన్నారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించాలని సూచించారు. ర్యాలీ నిర్వహించారు.

కశింకోట : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని అనకాపల్లి రూరల్ సిఐ రవికుమార్ అన్నారు. మండలంలోని తాళ్ళపాలెం జంక్షన్‌లో రోడ్డు భద్రత వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆదినారాయణ రెడ్డి, అదనపు ఎస్ఐ నాగేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో పూడికతీత



డ్రైనేజీల్లో పూడిక తీస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని ఏఎల్‌పురం ఏడవ వార్డులో పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో డ్రైనేజీలో పూడికతీత పనులు ప్రారంభించారు. డ్రైనేజీలు నిండి, రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తూ ప్రజలు అవస్థలు పడుతున్న నేపథ్యంలో మంగళవారం డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త ఎల్లవరం పాఠశాలలో స్వాభిమాన్

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని కొత్త ఎల్లవరం జెడ్‌పి హైస్కూల్లో స్వాభిమాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య ప్రవర్తనపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రఘు, ఎస్ఐ నారాయణరావు, సెక్రటరీ శ్రీనివాస్,ఎఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారి

పశువ్యాధులపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గణేష్‌రెడ్డి

ప్రజాశక్తి- చీడికాడ : మండలంలోని, ఖండివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు పశువ్యాధులపై ఖండివరం పశు వైద్యులు డాక్టర్ సిహెచ్ గణేష్‌రెడ్డి ధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కెజె.పురం వెటర్నరీ డాక్టర్ మణిలక్ష్మణ విద్యార్థులకు పశుసంవర్థక సేవలు, పశువుల్లో జెనెటిక్ వ్యాధులు, పెంపుడు జంతువుల వల్ల వచ్చే వ్యాధులు, వాటి ద్వారా సంక్రమించే వ్యాధులు, వ్యాక్సినేషన్, ఇతర విషయాలపై అవగాహన కల్పించారు అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పిల్లలకు బహుమతులు పంపిణీ చేశారు కార్యక్రమంలో విఎల్ఓ వర్ధినియా, వెటర్నరీ అసిస్టెంట్ రిషి, గంగు నాయుడు పాల్గొన్నారు

నెలాఖరులోగా గృహ సారథుల నియామకం

ప్రజాశక్తి -నక్కపల్లి: నెలాఖరులోగా గృహసారథుల నియామకం చేపట్టాలని వైసిపి మండల శాఖ అధ్యక్షులు పొడగట్ల పాపారావు అన్నారు. మంగళవారం మండలంలోని ఉద్దండపురం గ్రామంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, డిసిఎం ఎస్ మాజీ ఉపాధ్యక్షులు అయినంపూడి మణిరాజు, వైస్ ఎంపిపి వెలగా ఈశ్వరరావులతో కలిసి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి,పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి వైవి సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు కరణం ధర్మశ్రీ, స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఆదేశాల మేరకు మండలంలో అన్ని సచివాలయాలకు కన్వీనర్లను నియమించామన్నారు. 50 కుటుంబాలకు ఇద్దరు గృహ సారధులను వారిలో ఒక మహిళ, నియమించాల్సి ఉంద న్నారు. సర్పంచ్‌లు పొడగట్ల వెంకటేష్, సాధిరెడ్డి శ్రీనివాస రావు, సురేష్ వర్మ , ఎంపిటిసి గంటా తిరుపతిరావు, పార్టీ నేతలు కొప్పిశెట్టి హరిబాబు, తళ్ల భార్గవ్, తోట సత్తిబాబు, గొర్ల గోవిందు,పొడగట్ల రాజా కుర్ర గోవిందు, ప్రకాశరావు, లక్ష్మణరావు , కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరి అభ్యున్నతే లక్ష్యం



గడపగడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి మాకవరపాలెం: అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మంగళవారం జె.వెంకటాపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. గ్రామాల్లో ఇంకా అర్హులై ప్రభుత్వ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం సమగ్ర భూసర్వే పట్టాదారులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు కార్యక్రమంలో ఎంపిపి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు రుత్తుల వాసు, స్థానిక నాయకులు గంగరాజు, గోవింద, రమేష్, నూకరాజు పాల్గొన్నారు.

సంపద కేంద్రాన్ని డిపిఒ సందర్శన



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఓ శిరీష రాణి

ప్రజాశక్తి- నక్కపల్లి: నక్కపల్లి సంపద తయారీ కేంద్రాన్ని శిక్షణ కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు డిపిఒ శిరీష రాణి తెలిపారు. మంగళవారం కేంద్రాన్ని పరిశీలించారు. నక్కపల్లి సంపద కేంద్రంలో ఈ నెల 26 నాటికి శిక్షణ కేంద్రానికి సంబంధించిన అన్ని సదుపాయాలు కల్పించాలని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు ఆదేశించారు. అన్ని సచివాలయాల పరిధిలో జగనన్న స్వచ్ఛ సంకల్పంపై ప్రజలను భాగస్వామ్యం చేసేలా అవగాహన కల్పించాలన్నారు .కార్యక్రమంలో ఎంపిఇఒ సీతారామరాజు, ఇఒపిఆర్‌డి వెంకట నారాయణ పాల్గొన్నారు.

26న ఉచిత మెగా వైద్య శిబిరం



ప్రచారం చేస్తున్న ఎంవిఆర్ యువసేన

ప్రజాశక్తి-రోలుగుంట : ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయంతో గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 26న రోలుగుంట మండలం శరభవరం గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. విశాఖ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారని, అలాగే శిబిరానికి వచ్చే వారికి ఉచిత భోజన సదుపాయం, ఉచిత మెడికల్ గుర్తింపు కార్డు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని ఎంవిఆర్ యువసేన సభ్యులు గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీల ధర్నా



నర్సీపట్నంలో సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన

తమ సమస్యల పరిష్కారానికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు అంగన్వాడీలు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాలు, ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. రూ.26వేలు కనీసం వేతనం అమలు, ఫేషియల్ రికగ్నేషన్ హాజరు విధానం రద్దు, ఉద్యోగ భద్రత ఇతర సమస్యలపై ఆందోళన చేపట్టి, వినతిపత్రాలను అందజేశారు. ప్రభుత్వం స్పందించి , తక్షణమే తమ సమస్యలను పరిష్కరించకుంటే వచ్చేనెల 6న కలెక్టరేట్ల వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

- ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం



ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

పజాశక్తి -నర్సీపట్నం టౌన్ : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా నాయకురాలు వి.సామ్రాజ్యం మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ , ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఫేషియల్ రికగ్నేషన్ యాప్ ద్వారా హాజరు విధానాన్ని రద్దు చేయాలని కోరారు అంగన్వాడీ కేంద్రాల్లో సౌకర్యాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు బిల్లులు చెల్లించాలని కోరారు. అప్పులు చేసి, పిల్లలకు ఆహారం పెట్టే పరిస్థితుల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. రకరకాల యాప్‌లతో పనిభారం, ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి వచ్చేనెల 6న కలెక్టరేట్ వద్ద ఆందోళనకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాగమణి పర్వీన్ పాల్గొన్నారు. అనంతరం సిడిపిఒ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు

నర్సీపట్నం టౌన్ : సుప్రీంకోర్టు తీర్పు మేరకు అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, గ్రాటూ, ఇతర సౌకర్యాలను కల్పించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్‌డిఒ జయరామ్‌కు అందజేశారు. జిల్లా అధ్యక్షులు ఎం అప్పలరాజు, ఉపాధ్యక్షులు నవర మణి, కార్యవర్గ సభ్యులు రొంగల సత్య, పులగోరు వరలక్ష్మి, నర్సీపట్నం ప్రాజెక్టు నాయకులు ఘాటీలమ్మ, చిన్నారి, రాజేశ్వరి పాల్గొన్నారు.

నక్కపల్లి : సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, కార్యదర్శి నూకరత్నం, రమణమ్మ ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. తమకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వీసులో వుండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, జాబ్ కేలండర్ నిర్ణయించాలని కోరారు. సిడిపిఒ శ్రీవిద్యకు సంఘ ప్రతినిధులు కవిత, లక్ష్మీరాజ్యం, భవానీ, జ్యోతి, పద్మలక్ష్మి, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు త్రినాథ్ వినతిపత్రం సమర్పించారు.

భీమునిపట్నం : అంగన్‌వాడీలకు కనీస వేతనం నెలకు రూ26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి ప్రాజెక్ట్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు కె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ, ఫేస్ యాప్ రద్దుచేయాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, వంట గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, అంగన్వాడీ కేంద్రాల తనిఖీల పేరుతో కార్యకర్తలపై వేధింపులు నిలిపి వేయాలని, 2017 నుంచి పెండింగులో ఉన్న టిఎ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి ఎస్.లక్ష్మి మాట్లాడుతూ, కేంద్రాలకు నాణ్యమైన వంట నూనె, కందిపప్పు, ఇతర సరుకులు సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఎస్.శ్రీదేవి, జిల్లా కోశాధికారి కె పద్మ, నాయకులు ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు అనంతరం ఆయా డిమాండ్లపై పిఒ ఎం.శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు.

కోటవురట్ల : కనీస వేతనం రూ.26వేలు అమలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. సిడిపిఒకు వినతిపత్రం అందించారు యూనియన్ నేతలు పుష్ప, చెన్నమ్మ డిమాండ్ చేశారు.

కంచరపాలెం : అంగన్‌వాడీ కార్యకర్తలకు ఫేస్ యాప్‌ను రద్దుచేయాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలను పెంచాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు బి.తులసి డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఆర్ అండ్ బి వద్ద ఉన్న అర్బన్-1 సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల, ఆయాలు మంగళవారం నిరసన చేశారు. ఇప్పటికే అప్పగించిన పలు యాప్‌ల నమోదుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు సక్రమంగా పనిచేయడం లేదని, కొన్ని చోట్ల నెట్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమయంలో మళ్లీ కొత్తగా ఫేస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు తీవ్ర ఒత్తిడికి గురి చేయడం తగదన్నారు.. అనంతరం అర్బన్-1 సీడీపీఓ ఎంవి.రమణి కుమారికి వినతిపత్రం సమర్పించారు. జి.లక్ష్మి, బి.సంధ్య, ఎన్.ప్రియ, అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన మంగళవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ధర్నా చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 1ని రద్దు చేయాలని కోరారు. హెల్పర్ల ప్రమోషన్లకు వయో పరిమితి 50ఏళ్లకు పెంచాలని, ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని కోరారు.సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, అంగన్వాడీ కార్యకర్తలు కెఎంఎస్.జయలక్ష్మి, బి.తులసి లక్ష్మి, పి.అంజలి, బి. కమల కుమారి, ఎస్.రజిని, టి .శ్యామల, కె. వరలక్ష్మి, కె.దేవి, విఎస్‌జి. పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలని సబ్బవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ వర్కర్లు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకులు వివి రమణమ్మ, బి.రమణమ్మ, సిహెచ్ దేవి, ఎం.రమణమ్మ, ఎస్. జగదీశ్వరి, పుష్పాదేవి, శివరామ లక్ష్మీ, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లిలో...



కోటవురట్లలో...



సబ్బవరంలో...

పారదర్శకంగా నియామకాలు చేపట్టాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం : అంగన్వాడీ పోస్టుల నియామకంలో అధికార పార్టీ నేతల సిఫార్సులకు తలొగ్గకుండా పారదర్శకంగా భర్తీ చేయాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీలో ఇంటర్వ్యూలు నామమాత్రంగానే నిర్వహించి, వైసిపి నేతల సిఫార్సులకే పెద్దపీట వేసి నియామకాలు చేపట్టాలని ఆరోపణలు వస్తున్నాయన్నారు.

ఆయాగ్రామాల్లో పోస్టుల కేటాయింపునకు వైసిపి నేతలు బాహాటంగానే బేరసారాలు కుదుర్చుకున్నారని విమర్శలు వస్తున్నాయన్నారు. అలాంటపుడు నోటిఫికేషన్ జారీ, ఇంటర్వ్యూలు ఈ తంతు అంతా ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇంటర్వ్యూల్లో పాల్గొన్న అభ్యర్థుల మెరిట్ జాబితా నోటీస్ బోర్డుల్లో వెల్లడించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రేగుపల్లి శివ, బోయిన చిరంజీవి, కర్రి సంతోష్, మారిశెట్టి రాజా, మాక్ రెడ్డి వెంకటరమణ, దత్తుడు ఉన్నారు.

27న వాహనాల వేలం

ప్రజాశక్తి-గొలుగొండ : స్పెషల్ ఎన్‌పోర్సుమెంట్ బ్యూరో గొలుగొండ స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాలలో పట్టుబడిన 11 వాహనాలను ఈ నెల 27న నర్సీపట్నం స్పెషల్ ఎన్‌పోర్సుమెంట్ బ్యూరో స్టేషన్‌లో బహిరంగ వేలం వేయనున్నారనిగొలుగొండ ఎన్‌పోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కె.రాజారావు తెలిపారు. అనకాపల్లి అసిస్టెంట్ ఎన్‌పోర్సుమెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ పర్యవేక్షణలలో ఈ వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.ఐదు వేల ధరావత్తుముందుగా చెల్లించి, టోకెన్ పొందడం ద్వారా వేలంలో పాల్గొనవచ్చన్నారు. వేలంలో వాహనాలు దక్కని వారికి ధరావత్తు వాపసు చేస్తారన్నారు.